నమస్తే తెలంగాణ
మహబూబ్‌నగర్
నారాయణపేట
5 | మహబూబ్‌నగర్, బుధవారం 25 సెప్టెంబర్ 2024 | MAHABUBNAGAR NARAYANPET

మమ్మల్ని అరెస్ట్ చేసి పనులు చేయండి..

ఉదండాపూర్ రిజర్వాయర్ కింద తమకు గత ప్రభుత్వ హామీ ఇచ్చిన విధంగా మల్లన్నసాగర్ సలహాలోని నష్టపరిహారం అందించాలని రైతులు డిమాండ్ చేశారు. ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ ఇతరత్రా సమస్యలు రెవెన్యూ పోలీసుల దృష్టికి తీసుకొచ్చారు. నష్టపరిహారం చెల్లించాకనే పనులు ప్రారంభించాలని అంతవరకు పనులను చేపట్ట వద్దని అల్టిమేట్ జారీ చేశారు. సర్కారు అంగీకరించక పోతే తమను అరెస్ట్ చేసి జైల్లో పెట్టి పనులు ప్రారంభించుకోండని అని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పరిహారం కోసం ఉన్న పొలాలను వదిలిరోడ్డున పడుతున్నా ప్రభుత్వాలు కనికరించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులను ఆందోళనకారులుగా చిత్రీకరిస్తున్నారని మండిపడ్డారు. తమ డిమాండ్లను ఒప్పుకుంటేనే పనులు చేపట్టవచ్చని లేకపోతే పనులు జరగనివ్వబోమని హెచ్చరించారు. ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీలో 18 ఏండ్లు నిండిన యువకులను కూడా ప్రత్యేకంగా గుర్తించాలని వారికి కూడా ఇంటి ప్లాట్‌తో పాటు నష్టపరిహారం ఇవ్వాలన్నారు. కొంతమంది కట్టుకున్న ఇండ్లకు ప్లాట్లకు డాక్యుమెంట్లు లేవని వాటినీ పరిగణలోకి తీసుకొని నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. దీంతో డీఎస్పీ, తాసీల్దార్ నచ్చజెప్పి మంత్రులకు వినతిపత్రం అందించడంతోపాటు పర్యటనను విజయవంతం చేయాలని కోరడం కోస మెరుపు. మంత్రుల పర్యటన కోసం అధికార యంత్రాంగం రైతులను ఒప్పించడం తీవ్ర విమర్శలకు తావిస్తోంది.

జీల్దార్ తిప్ప చెరువు (ఫైల్)

జీల్దార్ తిప్పకు జలకళ వచ్చేనా?

- ప్రభుత్వం మారడంతో పునాదికే పరిమితమైన పనులు
- మంత్రుల పర్యటనతో రైతుల్లో చిగురిస్తున్న ఆశలు
- పీఆర్ఎల్ఐ నీరందించాలని డిమాండ్

కొల్లాపూర్, సెప్టెంబర్ 24 : కొల్లాపూర్ నియోజవర్గంలో దీర్ఘకాలిక డిమాండ్ ఉన్న జీల్దార్‌తిప్పకు సాగునీరు అంశం నేడు ప్రాజెక్టుల సందర్శనలో మంత్రుల దృష్టికి వస్తుందా అని రైతులు వేయి కండ్లతో ఎదురుచూస్తున్నారు. కృష్ణానదికి కూతవేటు దూరంలో ఐదు గ్రామాలకు దాదాపు ఏడు వేల ఎకరాలకు సాగు నీరందించే అవకాశం ఉన్న జీల్దార్‌తిప్ప సమాఖ్య పాలనలో వివక్షతకు గురైంది. కొల్లాపూర్ పూర్వ ఎమ్మెల్యే రంగాదాసు సమయంలో జిల్దార్‌తిప్ప ద్వారా ఆయకట్టుకు సాగునీరు అందించారు. మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి ప్రత్యేక చొరవతో జీల్దార్‌తిప్ప చెరువుకు పీఆర్ఎల్ఐ ద్వారా శ్రీశైలం బ్యాక్ వాటర్‌ను లిఫ్ట్ చేసి సాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం పునాది వేశారు. కానీ ప్రభుత్వం మారడంతో జీల్దార్‌తిప్ప చెరువుకు సాగునీటి సమస్య మళ్లీ మొదటికి వచ్చింది. ఉమ్మడి రాష్ట్రానికి వెలుగు అందించేందుకు, స్వరాష్ట్రంలో ఎగువ ప్రాంతాలకు సాగునీరు అందించేందుకు త్యాగం చేసిన ఇక్కడి రైతులకు సాగునీరు అందకపోవడంతో రైతులు తీవ్ర నిరాశలో ఉన్నారు. బుధవారం ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పీఆర్ఎల్ఐ సందర్శనకు వస్తుండడంతో రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. జీల్దార్ తిప్ప చెరువుకు పీఆర్ఎల్ఐ నుంచి సాగు నీరు అందించాలని రైతు సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

పింఛన్లు ఇవ్వాలని ఎమ్మెల్యేను అడుగుతున్న మహిళలను నిలువరిస్తున్న కానిస్టేబుల్

హామీల అమలేదీ?

- ఎమ్మెల్యే వాకిటి శ్రీహరిని నిలదీసిన రైతులు, మహిళలు

అమరచింత, సెప్టెంబర్ 24 : ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ ఇచ్చిన హామీల అమలు ఏమైందని మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరిని నిలదీసిన ఘటన అమరచింత మండలం నాగల్‌కడ్మూర్‌లో చోటు చేసుకున్నది. నాగల్‌కడ్మూర్‌లో గ్రామస్తులు చందాలు వేసుకొని ఏర్పాటు చేసుకున్న 16 సీసీ కెమెరాలను ఆత్మకూర్ సీఐ శివశంకర్, అమరచింత ఎస్సై సురేశ్‌తో కలిసి ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి మంగళవారం ప్రారంభించారు. అనంతరం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన సబ్సిడీ సిలిండర్ల ద్రువపత్రాల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రూ.2లక్షల రుణమాఫీ అమలు చేశామని, రెండు వందల యూనిట్ల వరకు ప్రతి ఇంటికీ ఉచిత విద్యుత్ అందిస్తున్నామని అనడంతో గ్రామానికి చెందిన వ్యక్తి తమకు ఉచిత విద్యుత్ పథకం అమలు కావడం లేదని, ఈ రోజే విద్యుత్ అధికారులు నాతో బిల్లు కట్టించుకున్నారని ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చాడు. అదేవిధంగా మీరు చెప్పినట్లుగా రూ.2లక్షల రుణమాఫీ మాకు అమలు కాలేదని తిరుపతన్న, రాజశేఖర్‌గౌడ్, రంగన్న, నడిపి కృష్ణారెడ్డి, బీ తిరుపతిరెడ్డితోపాటు పలువురు రైతులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. రుణమాఫీ ఎందుకు కాలేదని అడుగుతుండగానే, మరోపక్క మహిళలు లేచి భూమి లేని వాళ్లకు ఇస్తామన్న కౌలు రైతు డబ్బులను ఇవ్వాలని, ఆసరా పింఛన్లు ఇవ్వాలని నిలదీశారు. దీంతో అక్కడే ఉన్న కానిస్టేబుల్ ఆ మహిళలను గమ్ముగా కూర్చోవాలని, లేదంటే ఇక్కడి నుంచి వెళ్లాలని అనడంతో ఎమ్మెల్యే కల్పించుకొని గ్రామంలో 143మంది రైతులకు రూ. 4.17 కోట్ల రుణమాఫీ అయ్యిందని, కొంతమందికి రాకపోతే ఇంతలా గొడవ చేయడం సరికాదన్నారు. అక్కడే ఉన్న విద్యుత్, వ్యవసాయ అధికారులను వీళ్లకు ఎందుకు రుణమాఫీ, ఉచిత విద్యుత్ అమలు కాలేదని ఎమ్మెల్యే శ్రీహరిని ప్రశ్నించడంతో ఒకే రేషన్ కార్డుపై ఇద్దరు, ముగ్గురు రైతులు ఉండడంతో కాలేదని తెలిపారు. రుణమాఫీ, ఉచిత విద్యుత్, గ్యాస్ సిలిండర్ల లబ్ధిదారుల పేర్లను గ్రామ పంచాయతీ నోటీస్ బోర్డులో పెట్టాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు.

రుణమాఫీపై ఎమ్మెల్యేను అడుగుతున్న రైతు

అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ బదావత్ సంతోష్

చెంచుల అభ్యున్నతికి చర్చలు

- ఆధార్, రేషన్‌కార్డులు జారీ చేయాలి
- నాగర్‌కర్నూల్ కలెక్టర్ బదావత్ సంతోష్

నాగర్‌కర్నూల్, సెప్టెంబర్ 24 : జిల్లాలో పీవీటీజీ (పర్టికులర్లీ వల్నరబుల్ ట్రైబల్ గ్రూప్స్)గా గుర్తింపబడిన చెంచులకు ప్రధానమంత్రి జన్‌మన్ కార్యక్రమం ద్వారా వసతులు కల్పించాలని నాగర్‌కర్నూల్ కలెక్టర్ బదావత్ సంతోష్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో పీఎం జన్‌మన్ జనజాతి ఆదివాసీ న్యాయ మహాభిమాన్ పథకంపై ఐటీడీఏ పీవో రోహిత్‌గోపిడితో కలిసి సంబంధిత శాఖల అధికారులతో అంశాల వారీగా సమీక్ష నిర్వహించారు. ఇప్పటి వరకు చెంచు పెంటల్లో జరిగిన పనులు, జరగాల్సిన పనుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. జిల్లాలోని ఎనిమిది మండలాల్లోని 88 ఆదివాసీ చెంచు పెంటల్లో నివసిస్తున్న 8,772 మంది చెంచులకు ప్రధాన మంత్రి జన్‌మన్ పథకం ద్వారా 11రకాల మౌలిక వసతులు అందేలా చూడాలన్నారు. చెంచు ప్రజలందరికీ ఆధార్‌కార్డులను రాను న్న వారం రోజుల్లో అందించాలన్నారు. చెంచుల నివాస ప్రాంతాల్లో ఇప్పటికే మంజూరైన 890 ఇండ్లు, రోడ్ల వసతి, నివాసాలకు తాగునీటి సరఫరా, మొబైల్ మెడికల్ యూనిట్లు, అంగన్‌వాడీ సెంటర్లు, అన్ని పెంటల్లో విద్యుత్ కనెక్షన్లు పూర్తి చేయాలని చెప్పారు. పథకాలు అందించడంలో ఇబ్బందులు లేకుండా గుర్తింపు కార్డులు అందించేందుకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలన్నారు. వారంలోగా అందరికీ జనన ధ్రువపత్రాలు, ఆధార్‌కార్డులు, ఆయుష్మాన్ భారత్ కార్డులు, కిసాన్ క్రెడిట్ కార్డు అందించాలని పేర్కొన్నారు. చెంచులకు ఎవరికైతే బ్యాంకు ఖాతాలు లేవో వారందరికీ జన్‌ధన్ ఖాతాలను తెరిపించేలా చర్యలు తీసుకోవాలని ఎల్‌డీఎంకు సూచించారు. అదేవిధంగా పట్టా కలిగి ఉన్న కుటుంబ భూ యజమాని మరణిస్తే వారి కుటుంబ వారసులకు భూబదలాయింపులను నిరంతరంగా కొనసాగించాలని ఆదేశించారు. సమీక్షలో జిల్లా పశుసంవర్ధకశాఖాధికారి రమేశ్, డీఆర్‌డీవో చిన్న ఓబులేశ్, డీపీవో రామ్మోహన్‌రావు, అచ్చంపేట, కొల్లాపూర్ ఆర్డీవోలు మాధవి, నాగరాజు, వివిధ శాఖల జిల్లా అధికారులు, ఎనిమిది మండలాల ఎంపీడీవోలు, తాసీల్దార్లు పాల్గొన్నారు.


కారును మార్కెట్‌లోకి విడుదల చేస్తున్న షోరూం నిర్వాహకులు

మార్కెట్‌లోకి హ్యుండాయ్ అల్కాజార్

మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 24 : జిల్లా కేంద్రంలోని ట్రెండ్ హ్యుండాయ్ కారు షోరూంలో మంగళవారం అల్కాజార్ కారును డీఎస్పీ వెంకటేశ్వర్లు షోరూం మేనేజింగ్ డైరెక్టర్ గట్టు గోపాల్‌రెడ్డితో కలిసి మార్కెట్లోకి విడుదల చేశారు. ఈ సందర్భంగా గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ హ్యుండాయ్ కంపెనీ ఎప్పటికప్పుడు నూతన ఆవిష్కరణలు చేస్తూ వినియోగదారుల అభిరుచికి అనుగుణంగా కొత్త, కొత్త వాహనాలను మార్కెట్లోకి విడుదల చేస్తుందన్నారు. అల్కాజార్ కారులో 6/7 సీట్లు కలిగి 73 భద్రతా ప్రత్యేకతలు కలిగి ఉన్నాయని, ఈ కారు పెట్రోల్, డీజిల్‌తోపాటు మ్యాన్యువల్, ఆటోమెటిక్ గేర్లు కలిగి ఉన్నాయన్నారు. కారు ప్రారంభ ధర రూ.14.99 లక్షలు ఉండగా, మార్కెట్‌లో ఆరు వేరియెంట్లలో లభిస్తుందన్నారు. కార్యక్రమంలో మార్కెటింగ్ డైరెక్టర్ హర్షిత్‌రెడ్డి, యుక్తా మోటర్స్ సీఈవో సిరిచందనారెడ్డి, సేల్స్ మేనేజర్ హర్ష వర్ధన్‌రెడ్డి, సర్వీస్ మేనేజర్ వసీ పాల్గొన్నారు.


ఉదండాపూర్ రిజర్వాయర్ ముంపు గ్రామాల ప్రజలతో సమావేశమైన అధికారులు

పరిహారం ఫస్ట్ పనులు నెక్స్ట్

- ఉదండాపూర్ భూ నిర్వాసితుల అల్టిమేటం
- షరతుల్లేకుండా ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ ఇవ్వాలని డిమాండ్
- తమను జైల్లో పెట్టి పనులు చేపట్టాలని ఆక్రోశం
- పోలీసులతో వాగ్వాదం

మహబూబ్‌నగర్, (నమస్తే తెలంగాణ ప్రతినిధి)/జడ్చర్ల, సెప్టెంబర్ 24 : ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో రాష్ట్ర మంత్రులు పెండింగ్ ప్రాజెక్టుల సందర్శన రైతుల పాలిట శాపంగా మారింది. మంత్రుల పర్యటనకు అడ్డు తగుల వద్దని ఏకంగా రైతులను ఠాణాకు పిలిపించిన ఘటన మహబూబ్‌నగర్ జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. బుధవారం రాష్ట్ర మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, దామోదర రాజనర్సింహా, జూపల్లి కృష్ణారావుతోపాటు ఎమ్మెల్యేలు ఉమ్మడి జిల్లాలో మహబూబ్‌నగర్, గద్వాల, వనపర్తి, నాగర్‌కర్నూల్ జిల్లాలోని ప్రాజెక్టులను పరిశీలించనున్నారు. ఈ నేపథ్యంలో జడ్చర్ల మండలం ఉదండాపూర్ గ్రామంలో చేపడుతున్న రిజర్వాయర్ కింద భూములు కోల్పోతున్న రైతులను మంగళవారం జడ్చర్ల పోలీసులు స్టేషన్‌కు రావాలని హుకూం జారీ చేశారు. దీంతో ఆందోళన చెందిన రైతులు ఉదండాపూర్ రిజర్వాయర్ కింద ముంపునకు గురవుతున్న గ్రామాల రైతులంతా మూకుమ్మడిగా జడ్చర్ల పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నారు. అక్కడ రైతులు పోలీసులకు మధ్య కాసేపు వాగ్వాదం జరగడంతో చివరకు వారిని ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్‌కు తరలించి అక్కడ చర్చలు జరిపారు. అయితే రైతులంతా తమను అరెస్టు చేసి జైల్లో పెట్టి పనులు చేసుకోండని పోలీసులకు సవాల్ విసరడంతో పరిస్థితి అదుపు తప్పింది. చివరకు రైతులను ఒప్పించి మంత్రుల పర్యటనను అడ్డు తగులవద్దని పోలీసులు, రెవెన్యూ యంత్రాంగం హుకూం జారీ చేయడం గమనార్హం.

మంత్రుల బృందం పర్యటన..

మహబూబ్‌నగర్ జిల్లాలో పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం కింద ఉదండాపూర్ రిజర్వాయర్ పంప్‌హౌస్ నిర్మాణం గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టింది. అయితే ప్రభుత్వం నచ్చజెప్పి మల్లన్నసాగర్‌కు ఇచ్చిన విధంగానే రైతులకు పరిహారం చెల్లిస్తామని హామీ ఇచ్చి పనులు ప్రారంభించింది. ఆ తర్వాత అనేక అడ్డంకులు రావడంతో డిమాండ్లు పెరగడంతో పరిహారం విషయంలో జాప్యం జరిగింది. ఈ లోపు ప్రభుత్వం మారడంతో స్థానిక ఎమ్మెల్యే ఇటీవల ఉదండాపూర్ రిజర్వాయర్‌ను సందర్శించి ముంపునకు గురవుతున్న గ్రామాల రైతులతో చర్చలు జరిపారు. గత ప్రభుత్వం హామీలను మరిచిందంటూ ఈసారి తమ ప్రభుత్వంతో మల్లన్నసాగర్‌లో రైతులకు ఇచ్చిన ప్యాకేజీ ఇప్పిస్తానని, లేకుంటే తానే మీ తరపున ఆందోళన చేస్తామని హామీ ఇచ్చి వచ్చారు. ఈలోపు ఉమ్మడి జిల్లాలో ప్రాజెక్టుల సందర్శనకు మంత్రుల బృందం పర్యటన ఖరారైంది. ఎమ్మెల్యే హామీ ఏమైందో కానీ మహత్తుగా మంగళవారం ఉదండాపూర్ రిజర్వాయర్ కింద ముంపు గ్రామాల్లోని కొంతమంది రైతులకు జడ్చర్ల పోలీస్ స్టేషన్ నుంచి పిలుపు వచ్చింది. మంత్రులను నిలదీస్తారని ఉద్దేశంతో కొందరు రైతులను స్టేషన్‌కు పిలిపించి పర్యటన సాఫీగా జరిపేందుకు పోలీసులు ఉత్సాహం ప్రదర్శించడం పలు విమర్శలకు తావిస్తోంది. ఈలోపు రెవెన్యూ అధికారులు కూడా రంగంలోదిగి రైతులను నచ్చజెప్పేందుకు ప్రయత్నించారు.

జడ్చర్ల ఠాణాకు ఉదండాపూర్ రైతులు..

మంత్రుల పర్యటనకు అడ్డువస్తారని నేపథ్యంలో కొంతమంది రైతులను పోలీస్ స్టేషన్‌కు పిలిపించడంతో ఉదండాపూర్ రిజర్వాయర్ కింద ముంపునకు గురవుతున్న నాలుగు గ్రామాల ప్రజలు జడ్చర్ల పోలీస్ స్టేషన్‌కు పెద్ద ఎత్తున తరలివచ్చారు. కేవలం అడ్డు తగులుతారనే నేపథ్యంలో నలుగురు రైతులను పిలిపిస్తే ఇంతమంది ఎందుకు వచ్చారని పోలీసులు ప్రశ్నించారు. ఇదంతా మా గ్రామాల సమస్య అందుకోసమే అందరం కలిసి వచ్చామని జవాబు ఇచ్చారు. ఈలోపు కావాలని పోలీసులు తమను పిలిచి అరెస్ట్ చేయాలని ప్రయత్నిస్తున్నారని తెలిసి స్టేషన్ ముందు ఆందోళనకు దిగారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో చివరకు పోలీస్‌స్టేషన్‌లో కాకుండా ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్ వద్ద అధికారులతో మాట్లాడుదామని అక్కడికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా మహబూబ్‌నగర్ డీఎస్పీ వెంకటేశ్వర్లు జడ్చర్ల తాసీల్దార్లు రైతులతో మాట్లాడుతూ మంత్రుల పర్యటనకు అడ్డుతగులవద్దని ఏమైనా సమస్యలు ఉంటే పరిష్కరించుకోవాలని సూచించారు. అవసరమైతే మంత్రులను కల్పిస్తామని వినతిపత్రాలు ఇచ్చుకోవచ్చని సలహా ఇచ్చారు.

మంత్రుల పర్యటన ఇలా..

రాష్ట్ర నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి దామోదర రాజనర్సింహా, ఎక్సైజ్, పర్యాటకశాఖల మంత్రి జూపల్లి కృష్ణారావుతో కూడిన మంత్రుల బృందం ఉమ్మడి జిల్లాలో పర్యటించనున్నది. ముందుగా జడ్చర్ల మండలం ఉదండాపూర్‌కు హెలికాప్టర్ ద్వారా చేరుకుంటారు. అక్కడ రిజర్వాయర్ పరిశీలన అనంతరం నేరుగా గద్వాల జిల్లా గట్టు ఎత్తిపోతల పథకాన్ని, అక్కడి నుంచి వనపర్తి జిల్లాలోని శంకర సముద్రం రిజర్వాయర్‌ను, ఆ తర్వాత పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగంగా కొల్లాపూర్ సమీపంలోని నార్లాపూర్, నాగర్‌కర్నూల్ సమీపంలోని వట్టెం పంప్‌హౌస్‌లను పరిశీలిస్తారు. అనంతరం నాగర్‌కర్నూల్ కలెక్టరేట్‌లో ఉమ్మడి జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు, ఆయా జిల్లాల కలెక్టర్లు, సాగునీటి పారుదల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించనున్నారు.

పోలీసుల అత్యుత్సాహం

- జడ్చర్ల పీఎస్‌కు మూకుమ్మడిగా తరలివచ్చిన ఉదండాపూర్ నిర్వాసితులు
- మంత్రుల పర్యటనను అడ్డుకోవద్దని హుకూం జారీ చేసిన పోలీసులు
- ఆగ్రహంతో స్టేషన్ ఎదుట ఆందోళన
- దిగొచ్చి.. ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో ముంపు వాసులతో అధికారుల చర్చలు
- మంత్రులకు వినతిపత్రాలు ఇవ్వాలని సూచన

జడ్చర్ల పీఎస్ ఎదుట ఆందోళన చేస్తున్న నిర్వాసితులు

పది నెలల తర్వాత పాలమూరు పర్యటన!

- మాజీ మంత్రి కేటీఆర్ ప్రకటనతో దిగొచ్చిన సర్కారు
- నేడు ఎత్తిపోతల పరిశీలనకు మంత్రులు
- వట్టెం పంప్‌హౌస్ తేలితేనే పనులు ముందుకు..
- డిసెంబర్ నాటికి రైతుల ఆశలు నెరవేరేనా..?

నీట మునిగిన వట్టెం పంప్‌హౌస్ (ఫైల్)

నాగర్‌కర్నూల్, సెప్టెంబర్ 24 (నమస్తే తెలంగాణ) : కేటీఆర్ ఒత్తిడికి కాంగ్రెస్ సర్కారు దిగొచ్చింది. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పనులపై కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరిని ఎండగట్టడంతో ఉమ్మడి పాలమూరు జిల్లాలోని కాంగ్రెస్ ప్రజాప్రతినిధులంతా బుధవారం జిల్లాలోని నార్లాపూర్, వట్టెం రిజర్వాయర్ల పనులను పరిశీలించనున్నారు. బీఆర్ఎస్ హయాంలో దాదాపుగా పూర్తైన పథకం పనుల ఫలాలు రైతులకు ఏడాదిగా అందని ద్రాక్షగా మిగిలాయి. ఈ క్రమంలో వట్టెం రిజర్వాయర్ ముంపునకు గురికావడంతో ఈ డిసెంబర్‌కైనా పథకం ప్రారంభమయ్యేనో లేదోననే సందేహాల మధ్య మంత్రుల పర్యటన ఆసక్తి రేపుతోంది.

నేడు మంత్రుల పర్యటన..

దక్షిణ తెలంగాణను సస్యశ్యామలం చేసేందుకు తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ చేపట్టిన బృహత్తర పథకం పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పనుల ప్రగతి కాంగ్రెస్ ఏడాది పాలనలో అటకెక్కాయి. దాదాపుగా 10లక్షల ఎకరాలకు సాగునీరు అందించే ఈ పథకానికి సంబంధించి జిల్లాలోని కొల్లాపూర్ మండలం నార్లాపూర్ వద్ద అంజనగిరి రిజర్వాయర్‌ను ఏడాది కిందట కేసీఆర్ ప్రారంభించారు. అప్పటికే ఏదుల, వట్టెం రిజర్వాయర్ల పనులూ దాదాపుగా పూర్తయ్యాయి. గత డిసెంబర్ నాటికే ఈ ప్రాజెక్టులను ప్రారంభించేందుకు బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. ఈ క్రమంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం గత పది నెలలుగా ఈ ప్రాజెక్టును పూర్తిగా విస్మరించింది. సంబంధిత ఏజెన్సీ సైతం నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో ఏదుల, వట్టెం రిజర్వాయర్లు ఇప్పటికీ ప్రారంభానికి నోచుకోలేదు. పాలమూరు బిడ్డగా చెప్పుకొంటున్న సీఎం రేవంత్‌తోపాటుగా రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రులు సైతం ఇప్పటి వరకు ప్రాజెక్టును సందర్శించలేదు. గతంలో హైదరాబాద్‌లో సమీక్షా సమావేశాలకే పరిమితమయ్యారు. క్షేత్రస్థాయిలో ప్రాజెక్టు పరిస్థితిని చూడకపోవడంతో ప్రాజెక్టు పనుల్లో జాప్యం ఏర్పడింది. తద్వారా గత డిసెంబర్‌లో ప్రారంభం కావాల్సిన ఈ ప్రాజెక్టు ఎప్పటికి అందుబాటులోకి వస్తుందో తెలియని పరిస్థితి నెలకొన్నది. ఇదిలా ఉంటే ఇటీవలి వర్షాలకు శ్రీపురం, కుమ్మెర తదితర ప్రాంతాల్లో అడిట్‌ల్ గుండా చేరిన వరద నీరు వట్టెం రిజర్వాయర్‌ను ముంచింది. దీనివల్ల రూ.5వేల కోట్ల విలువైన ప్రాజెక్టు పరిధిలో రూ.2వేల కోట్లకుపైగా విలువైన మోటర్లు నీట మునిగాయి. ఈ నీటి తోడివేత పూర్తిస్థాయిలో జరగక పనులకు మరింత ప్రతిబంధకంగా మారింది. ఈ డిసెంబర్‌లో రిజర్వాయర్లను ప్రారంభిస్తామని ప్రభుత్వం పేర్కొంటున్నా ప్రస్తుతం మునక వల్ల అది జరుగుతుందా లేదా అనే సందేహాలు రైతుల్లో వ్యక్తమవుతున్నాయి. ఈ క్రమంలో ఇటీవల జిల్లాకు వచ్చిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఉమ్మడి పాలమూరులో బీఆర్ఎస్ హయాంలో కేసీఆర్ నాయకత్వంలో చేపట్టిన ప్రాజెక్టు పనులను ప్రజల ముందుంచేందుకు సిద్ధమవుతున్నట్లు ప్రకటించారు. మేడిగడ్డ తరహాలో బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, ఉమ్మడి పాలమూరు బీఆర్ఎస్ నాయకత్వం పాలమూరు ఎత్తిపోతలను సందర్శిస్తామని, పాలమూరు బిడ్డ అని చెప్పుకుంటున్న రేవంత్ స్పందించాలని డిమాండ్ చేశారు. సీఎం, నీటిపారుదల శాఖ మంత్రి ఒక్కసారైనా ప్రాజెక్టును సందర్శించారా అని నిలదీశారు. ఇలా కేటీఆర్ చేసిన ప్రకటనతో కాంగ్రెస్ ప్రభుత్వం దిగొచ్చింది. ఇందులో భాగంగా బుధవారం నార్లాపూర్, వట్టెం రిజర్వాయర్లను రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు సారథ్యంలో నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి దామోదర రాజనర్సింహా, ఉమ్మడి పాలమూరు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, తదితర నేతలు సందర్శించనున్నారు. ఇప్పటికే నల్లమలను పర్యాటకంగా అభివృద్ధి చేస్తామని ఇలా ఓసారి పర్యటించిన మంత్రుల బృందం వల్ల ఇప్పటికీ పెద్దగా జరిగిన అభివృద్ధి కనిపించలేదు. ఈ పర్యటన కూడా అలాగే ఉంటుందా, మంత్రుల పర్యటన తర్వాతేమైనా మార్పు వస్తుందో వేచి చూడాల్సి ఉన్నది.

మదనాపురం రైల్వేగేట్ సమీపంలో రోడ్డుపై ప్రవహిస్తున్న మారెడ్డిపల్లి వాగు

జూరాల మూడు గేట్ల ఎత్తివేత

- ఇన్‌ఫ్లో 51వేలు, అవుట్‌ఫ్లో 61,276 క్యూసెక్కులు

గద్వాల, సెప్టెంబర్ 24 : జూరాల ప్రాజెక్టుకు వరద కొనసాగుతున్నది. మంగళవారం ప్రాజెక్టుకు 51 వేల కూసెక్కుల ఇన్‌ఫ్లో చేరగా మూడు గేట్లు ఎత్తి నీటిని దిగువకు వదిలారు. పూర్తిస్థాయి నీటిమట్టం 318.516 మీటర్లు కాగా ప్రస్తుతం 318.460 మీటర్లు ఉన్నది. గరిష్ఠస్థాయి నీటినిల్వ 9.657 టీఎంసీలకు గానూ 9.542 టీఎంసీలు ఉన్నది. ఎడమ కాల్వకు 920, కుడి కాల్వకు 720, భీమా లిఫ్ట్-1కు 650, ఆర్డీఎస్ లింక్ కాల్వకు 50, విద్యుదుత్పత్తికి 37,176 క్యూసెక్కులు మొత్తంగా 61,276 క్యూసెక్కులు దిగువకు విడుదల చేస్తున్నారు.

ఆర్డీఎస్, టీబీ డ్యాంకు స్వల్పంగా..

అయిజ, సెప్టెంబర్ 24 : కర్ణాటకలోని ఎగువన కురుస్తున్న వర్షాలతో ఆర్డీఎస్ ఆనకట్టకు ఇన్‌ఫ్లో 9,310 క్యూసెక్కులు ఉండగా, అవుట్ ఫ్లో 8,700 క్యూసెక్కులుగా నమోదైంది. ఆయకట్టుకు 610 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం ఆనకట్టలో 9 అడుగుల మేరకు నీటి మట్టం ఉన్నది. టీబీ డ్యాంకు ఇన్‌ఫ్లో 7,980, అవుట్‌ఫ్లో 10,153 క్యూసెక్కులుగా నమోదైంది. 105.788 టీఎంసీలకుగానూ ప్రస్తుతం 101.539 టీఎంసీల నిల్వ ఉన్నది. అలాగే ఆల్మట్టి ప్రాజెక్టులోకి ఇన్‌ఫ్లో 15,002, అవుట్ ఫ్లో 12,144 క్యూసెక్కులు ఉన్నది. గరిష్ఠస్థాయి నిల్వ 129.72 టీఎంసీలకు గానూ, ప్రస్తుతం 128.19 టీఎంసీల నిల్వ ఉన్నది. నారాయణపూర్ ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో 13,332, అవుట్ ఫ్లో 14,307 క్యూసెక్కులుగా నమోదైంది. గరిష్ఠస్థాయి నీటి నిల్వ 37.64 టీఎంసీలకు గానూ ప్రస్తుతం 37.59 టీఎంసీలుగా ఉన్నట్లు ప్రాజెక్టు అధికారులు తెలిపారు.

తెరుచుకున్న సరళాసాగర్ సైఫన్లు

మదనాపురం, సెప్టెంబర్ 24 : మండలంలోని సరళాసాగర్ ప్రాజెక్టుకు ఆటోమెటిక్ సైఫన్లు (2 ఉడ్, 1 ప్రైమరీ) రాత్రి తెరుచుకున్నాయి. దీంతో మదనాపురం రైల్వేగేట్ సమీపంలోని రోడ్డుపై మారెడ్డిపల్లి వాగు రెండు గంటలపాటు ప్రవహించింది.

అనారోగ్యంతో బాలుడు మృతి

- పాఠశాల యాజమాన్యమే కారణమంటూ ఆగ్రహం
- విద్యార్థి బంధువుల నిరసన

గద్వాల అర్బన్, సెప్టెంబర్ 24 : అనారోగ్యంతో ఐదేండ్ల బాలుడు మృతి చెందిన ఘటన మంగళవారం జిల్లా కేంద్రంలో చోటు చేసుకున్నది. స్థానికుల వివరాల మేరకు.. గద్వాల మండలం పరిధిలోని పూడురు గ్రామానికి చెందిన యశ్వంత్ (5) జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో చదువుతున్నాడు. రోజువారీలో భాగంగా మంగళవారం కూడా యశ్వంత్ పాఠశాలకు వెళ్లి బస్సులో తిరుగు ప్రయాణంలో తీవ్ర అనారోగ్యానికి గురై ఫిట్స్ రావడంతో పాఠశాల యాజమాన్యం బాలుడిని జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానకు తరలించగా అప్పటికే బాలుడు మృతి చెందినట్లు తెలిసింది. తమ బాలుడు మృతికి పాఠశాల యాజమాన్యమే కారణమని తల్లిదండ్ర